## పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటాం



చెక్కును అందజేస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు

ఆసిఫాబాద్, అంబేద్కర్ చౌక్, నవంబర్ 20: మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు అండగా ఉంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు అన్నారు. లింగాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నారాయణ కుటుంబానికి బుధవారం జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో రూ.8.60 లక్షల చెక్కును పోలీస్ శాఖ తరపున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో సేవలందించి మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయ ఏవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అజయ్ వర్మ, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షుడు విజయ్ శంకర్ రెడ్డి తదితరులున్నారు.

## ధాన్యం కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

నస్పూర్, నవంబర్ 20 : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతు ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్నారు. తేమ శాతం, తాలు తరుగు లేకుండా చూసుకోవాలని, నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో 303 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు.



# తోడు కోసం అన్వేషణ

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అడవులను జల్లెడ పడుతున్న పెద్దపులులు

- 300 కిలోమీటర్లు ప్రయాణం చేసిన మహారాష్ట్ర నుంచి వచ్చిన టైగర్
- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో తిరుగుతున్న 'జానీ' అనే మగ పులి
- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా అడవుల్లో సంచరిస్తున్న మరో రెండు పెద్ద పులులు
- ఇప్పటికే జిల్లాలో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్న పది పులులు
- కొత్త పులుల రాకతో అప్రమత్తమైన అధికారులు



నేరడిగొండ మండలం నిర్మల్ ఘాట్ సెక్షన్‌పై దర్జాగా రోడ్డు దాటుతున్న పులి

మంచిర్యాల, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవులను పెద్ద పులులు జల్లెడ పడుతున్నాయి. సాధారణంగా చలికాలంలో తోడు కోసం తిరిగే పులులు వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తాయి. మగ పులులు తమ సామ్రాజ్యం (టెరిటోరి) హద్దులను దాటుకుని ఆడపులులను వెతుకుంటు వెళ్తాయి. ఆడపులులు కూడా మగ తోడు కోసం సంచరిస్తుంటాయి. ఈ క్రమంలోనే మహారాష్ట్ర నుంచి అక్టోబర్‌లో జానీ అనే పెద్దపులి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా అడవుల్లోకి ప్రవేశించింది. పశ్చిమ కనుమలుగా పేరున్న సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని అడవిలో కొన్ని రోజులు మకాం వేసిన ఆ పులి ఆడతోడు కోసం గడిచిన 30 రోజుల్లో 300 కిలోమీటర్ల పైచిలుకు ప్రయాణం చేసింది. నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్, కుంటాల, కుభీర్, నర్సాపూర్(జి), దిలావర్‌పూర్, పెంబీ మండలాల్లో తిరిగిన పులి కొన్ని రోజులుగా ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, నార్నూర్ అడవుల్లో తచ్చాడుతున్నది. ఉమ్మడి జిల్లాలోకి ప్రవేశించినప్పటి నుంచి ట్రాక్ చేస్తున్న అధికారులు.. వందల కిలోమీటర్లు మన అడవుల్లోనే తిరుగుతున్నట్లు చెప్తున్నారు. ఏడేండ్ల వయస్సున్న 'జానీ' తన ప్రయాణంలో ఐదు ఘటనల్లో పాడి పశువులపై దాడి చేసి చంపేసింది. మరో మూడు ఘటనల్లో పశువులపై దాడి చేసి గాయపరిచింది. తాజాగా.. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని ఖడ్కి అటవీ సమీపంలో పులి సంచరిస్తూ కనిపించింది. బుధవారం వేకువజామున కాలకృత్యాలకు వెళ్లిన గ్రామస్తులు పులిని చూసినట్టు తెలిపారు. అక్కడి నుంచి బురుకుంగూడ, లోకారి(కే), ధర్మగూడ అటవీ ప్రాంతం నుంచి పులి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మరోవైపు మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలోనూ పెద్దపులుల కదలికలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్ రేంజ్ అడవుల్లో నెలన్నర రోజులుగా సంచరించిన ఎస్–12 అనే మగ పులి ఇటీవలే ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి అడవుల్లోకి వెళ్లింది. మొత్తంగా ఉమ్మడి జిల్లాలోని అడవుల్లో రెండు నుంచి మూడు మగ పులులు ఆడపులి తోడు కోసం సంచరిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. కాగా.. ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ అడవుల్లోకి ఇటీవల మహారాష్ట్ర నుంచి రెండు పులులు వచ్చాయి. ఇందులో ఒకటి ఆడపులి ఉంది. కాకపోతే అది ఇక్కడే ఉందా? తిరిగి వెళ్లిపోయిందా? అన్న విషయాన్ని అధికారులు ధ్రువీకరించలేక పోతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూడు మగపులులు, ఒక ఆడపులి తోడును వెతుక్కుంటూ అడవుల్లో సంచరిస్తున్నట్లు అధికారులు నిర్ధారిస్తున్నారు.



పాత మంచిర్యాలలో అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కిన పెద్దపులి(ఫైల్)

### జిల్లాలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పులులు



ఆడెల్లి తండా శివారులో అక్టోబర్ 26న పులి దాడిలో గాయపడ్డ ఆవు

అటవీ శాఖ అధికారుల గణాంకాల ప్రకారం.. ఆసిఫాబాద్ జిల్లా అడవుల్లో పది నుంచి 12 పెద్ద పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాయి. వీటిలో రెండు ఆడ పులులు, ఏడు మగ పులులు ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి రెండు పులులు వచ్చాయి. దీంతో ఇప్పుడు కొత్తగా వచ్చిన మగ పులలకు ఇక్కడ ఆడతోడు దొరికే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు వచ్చిన పులులు ఇక్కడి అడవుల్లోనే కొంతకాలం ఉండే చాన్స్ ఉందంటున్నారు. పులులు వైల్డ్ ఎనిమల్స్ అయినప్పటికీ ఫ్యామిలీకి అత్యంత ప్రాధాన్యం ఇస్తాయి. ఆడ, మగ పులి కలిసి పిల్లల్ని కన్నాక ప్రస్తుతం అవి ఉంటున్న టెరిటోరిని వారసత్వంగా పిల్లలకు అప్పగించి అవి వేరే చోటుకు వెళ్లిపోతాయి. పులి పిల్లలు పెరిగి, స్వయంగా వేట నేర్చుకునే వరకు వాటినే అంటిపెట్టుకుని ఉంటాయని అధికారులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఆడపులి కోసం మగపులి అన్వేషణ తీవ్రంగా ఉంటుంది. ఆడపులి అడవిలో తిరుగుతూ దాని శరీరం నుంచి ఒక ప్రత్యేకమైన సెంట్‌ను రిలీజ్ చేస్తాయి. ఆ స్మెల్‌ను మగ పులులు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్నా పసిగడుతాయని అధికారులు చెప్తున్నారు. నిర్మల్, ఆదిలాబాద్‌లో తిరిగిన జానీ అనే పెద్దపులి, మంచిర్యాలలో సంచరించిన ఎస్–12 పులి రెండూ ప్రస్తుతం ఆసిఫాబాద్ అడవుల వైపే వెళ్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన మగ పులి కూడా ఆసిఫాబాద్‌లో అడవుల్లోనే మకాం వేసింది.

### కరెంట్ తీగలతో పులులకు ముప్పు

మహారాష్ట్ర నుంచి వచ్చిన పులుల రక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఫీల్డ్ డైరెక్టర్ టు టైగర్ ప్రాజెక్ట్(ఎఫ్‌డీపీటీ) శాంతారాం తెలిపారు. సీసీ కెమెరాలు, ఎనిమల్ ట్రాకర్స్ బృందాలను ఏర్పాటు చేసి పులల కదలికలను పసిగడుతున్నామన్నారు. ఫీల్డ్‌లో ఇబ్బందులు లేవన్నారు. కాకపోతే అడవుల్లో కొందరు అమర్చిన కరెంట్ తీగలతో కాస్త ఇబ్బందులు వస్తున్నాయి. సాధ్యమైనంత వరకు వాటిని గుర్తించి తొలగిస్తున్నాం. అనుమతి లేని కనెక్షన్లు ఏం ఉన్నా తీసివేసి, అనుమతి తీసుకోవాలని చెప్తున్నాం. ఒక్క ఆ విషయంలో తప్ప పులుల రక్షణలో ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదు. తోడు కోసం వెతుక్కుంటూ ఒక దగ్గరి నుంచి మరో దగ్గరికి వెళ్లే క్రమంలో ఎక్కడో చోట అటవీ సమీప ప్రాంతాలు, రోడ్లు దాటుతున్న సమయంలో జనాల కంట పడుతున్నాయి. ఆడతోడు కోసం సంచరించే పులులు ఎలాంటి హానీ చేయవు. పులులు కనిపిస్తే ఎటూ కదలకుండా నిలబడిపోవడం మంచిది.



పులి సంచారం ఉన్న ప్రాంతాలను పర్యటించి.. అటవీ సిబ్బందికి సూచనలు జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రియాల్

- నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో తిరిగిన జానీ అనే పెద్ద పులి, మంచిర్యాలలో సంచరించిన ఎస్–12 పులి రెండూ ప్రస్తుతం ఆసిఫాబాద్ అడవుల వైపే వెళ్తున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన మగ పులి కూడా ఆసిఫాబాద్‌లో అడవుల్లోనే మకాం వేసింది.
- మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో ప్రవేశించిన మగపులి తోడు కోసం పశ్చిమ కనుమలుగా పేరున్న సహ్యాద్రి పర్వత ప్రాంతంలోని అడవిలో కొన్ని రోజులు మకాం వేసిన గడిచిన 30 రోజుల్లో 300 కిలోమీటర్ల పైచిలుకు ప్రయాణం చేసింది.
- ఆసిఫాబాద్ జిల్లా అడవుల్లో 10 నుంచి 12 పెద్ద పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నాయి. వీటిలో రెండు ఆడ పులులు, ఏడు మగ పులులు ఉన్నాయి. మహారాష్ట్ర నుంచి రెండు పులులు వచ్చాయి. ఇక్కడ మగ పులలకు ఆడతోడు దొరికే అవకాశం ఉంది.
- పెద్ద పులులు అటవీ సమీప ప్రాంతాలు, రోడ్లు దాటుతున్న సమయంలో జనాల కంట పడుతున్నాయి. ఆడ తోడు కోసం సంచరించే పులులు హానీ చేయవు. పులులు కనిపిస్తే కదలకుండా నిలబడిపోవడం మంచిది.



కాసిపేట శివారులోని తిర్యాణి ప్రాంతంలోని ఏదులపాడ్‌లో లభ్యమైన పెద్దపులి పాదముద్రలు

## అడవిలోకి ఒంటరిగా వెళ్లొద్దు

- పులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి
- కుమ్రం భీం ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

జైనూర్, నవంబర్ 20: అడవిలోకి ఒంటరిగా వెళ్లవద్దని, పులి సంచారంపై సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్ హెచ్చరించారు. బుధవారం జైనూర్ మండలంలోని బూసిమెట్ట క్యాంపు వద్ద అవగాహన కల్పించారు. అనంతరం సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పులి ఈ ప్రాంతానికి వలస వచ్చిందని, ఇక్కడ ఎక్కువ రోజులు ఉండదని తెలిపారు. అటవీ ప్రాంత సమీపంలోని రైతులు ఉదయం 9 గంటలలోపు చేల వద్దకు వెళ్లవద్దని, సాయంత్రం 4 గంటలలోపు తిరిగి ఇంటికి రావాలని సూచించారు. రాత్రి వేళలో పంటలకు కాపలా వెళ్లే వారు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు. అటవీ సమీపంలోని గ్రామాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల కెరమెరి ఘాట్ ప్రాంతంలో కొలాం గిరిజన రైతు సీడం కన్నీరామ్‌కు చెందిన పశువుపై పులి దాడి చేసి చంపేయడంతో అటవీ శాఖ నుంచి మంజూరైన రూ.25 వేల నష్టపరిహారాన్ని బాధిత రైతుకు అధికారులు అందించారు. ఈ కార్యక్రమంలో కెరమెరి, జైనూర్ ఎఫ్ ఆర్వోలు మజారుద్దీన్, జ్ఞానేశ్వర్, డీఆర్వో రాజేశ్వరరావు, ఎఫ్ఎస్వోలు సక్కారం , భగవంత్‌రావు, ఎఫ్‌బీవో రవీందర్, మాజీ సర్పంచ్ కోట్నాక్ మోతుబాయి మాధవరావు, మాజీ ఉపసర్పంచ్ పార్వతి పుండలిక్, అటవీశాఖ ఉద్యోగులు, ప్రజలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



పులి దాడిలో చనిపోయిన పశువు యజమానికి నష్ట పరిహారాన్ని అందిస్తున్న అటవీ శాఖ అధికారులు, నాయకులు

## సరిహద్దులో పోలీసుల తనిఖీలు

వేమనపల్లి, నవంబర్ 20 : మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా బుధవారం వేమనపల్లి మండలంలోని ప్రాణహిత నది వేమనప ల్లి పుష్కరఘాట్ వద్ద రాచర్ల పుష్కరఘాట్ వ ద్ద నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. నది అవతలి వైపున మహారాష్ట్ర ఉండడం, బుధవారం అక్కడ ఎన్నికలు జరుగుతుండడంతో పడవల ద్వారా మహారాష్ట్ర నుంచి రాకపోకలు సాగించే వారిని వేమనపల్లి పుష్కర ఘాట్ వద్ద తనిఖీ చేశారు. ఆధార్‌కార్డులు, బ్యాగులను తనిఖీలు చేశారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అం దించాలని పడవలు నడిపేవారికి సూచనలు చేశారు. అసాంఘిక శక్తులకు సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రాణహిత నదిలో పడవలో వెళ్లే ప్రయాణికుల వివరాలు ఆరా తీస్తున్న నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్

# మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటేసిన సరిహద్దు గ్రామాల ప్రజలు



ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు



మహారాష్ట్ర రాజూర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ ) మహారాష్ట్రలో బుధవారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని వివాదాస్పద ప్రాంతంలోని కెరమెరి మండలానికి చెందిన 12 గ్రామాల ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజూరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని 12 గ్రామాల ప్రజలు రెండు రాష్ట్రాల్లో జరిగే ప్రతి ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. గత నవంబర్ నుంచి 4 ఎన్నికల్లో ఓట్లు వేశారు. ఈ గ్రామాల్లోని ఓటర్లకు రెండు రాష్ట్రాలకు సంబంధించిన ఓటర్ ఐడీ కార్డులు ఉండడంతో రెండు చోట్ల ఓటు వేస్తున్నారు. పరందోళి, నోరేవాడ, బోలాపటార్, అంతాపూర్ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఈ గ్రామాల్లో 3,597 మంది ఓటర్లు ఉన్నారు. పరందోళి పోలింగ్ కేంద్రం పరిధిలో పరందోళి, తండా, కోటా, శంకర్ లొద్ది, లేండిజాల, ముక్దంగూడ, గ్రామాలు, నోకేవాడ పోలింగ్ కేంద్రం పరిధిలో మహారాజ్ గూడ, బోలాపటార్ పోలింగ్ పరిధిలో బోలాపటార్, గౌరి, లేండిగూడ, అంతాపూర్ గ్రామాల పోలింగ్ కేంద్రం పరిధిలో నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, ఇంద్రానగర్, అంతపూర్ గ్రామాల ఓటర్లు ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. గతేడాది నవంబర్ 30న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఓటు హక్కు వినియోగించుకోగా..ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతో పాటు మహారాష్ట్రలో ఎంపీ స్థానానికి జరిగిన ఎన్నికల్లోనూ ఓటు వేశారు. బుధవారం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారు. ఓట్లు వేయడంతో పాటు తెలంగాణ– మహారాష్ట్ర రెండు రాష్ట్రాలకు సంబంధించిన సంక్షేమ పథకాలను వినియోగించుకుంటున్నారు.


